

నాసిరకం పనులపై విచారణ చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

రైల్వేకోడూరు నుండి మంగంపేట వరకు నేషనల్ హైవే పనులపై విచారణ జరపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారు రోడ్డు మరమ్మతుల చేశారని, రోడ్డుకి ఇరువైపులా గ్రావెల్ వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ శుద్ధ మట్టి తోలడంతో వాహన దారులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చిన్నపాటి వర్షానికి, తెల్లశుద్ధ, సైడ్ తీసుకున్న వాహనాలకు, బురదలో ఇరుక్కుపోతున్నాయని తెలిపారు. బైకులు, పాదచారులు బురదలో ఇరుక్కుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. టోల్గేట్ నుండి మైసూరుపల్లి రోడ్‌లో సోప్ ఫ్యాక్టరీ వద్ద, నేషనల్ హైవే రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. తక్షణంగుంతలు పూడ్చి తారు రోడ్డును వేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొచ్చర్ల సుబ్బరాయుడు రాజు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి : కలెక్టర్



ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-పీలేరు

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి కలెక్టర్ గిరీషా ఆదేశించారు. బుధవారం పీలేరు మండలంలోని రేగల్లు, బాలంవారిపల్లి గ్రామ సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్‌ఎల్‌ఎ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, అమ్మబడి, విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్న చేదోడు, కాపు నేస్తం, నేతన్న నేస్తం, ఆరోగ్యశ్రీ, వైఎస్ఆర్ బీమా, తదితర పథకాల నోటీస్ బోర్డ్‌లో ఉంచిన అర్హుల, అనర్హుల జాబితాలను తదితర వాటిని కలెక్టర్ పరిశీలించారు. సచివాలయం పరిధిలో ఎంత మందికి ఇళ్లు మంజూరయ్యాయి, ఏఏ దశలో ఇళ్ల నిర్మాణాలు పనులు జరుగుతున్నాయిని వంటి వివరాలను సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభం కానీ ఇళ్లు అన్ని పునాది స్థాయికి తీసుకురావాలని సూచించారు. బిఎల్ స్టేజిలో ఉన్న ఇళ్లని ఆర్‌సి స్టేజ్‌కు తీసుకురావాలన్నారు. రేగల్లులో ఇళ్ల నిర్మాణం బాగా జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీలకు అందించాల్సిన పౌష్టికాహారం, రక్తహీనత, మ్యుటేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకొని, మహిళా పోలీసు తమ పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను పర్యవేక్షిస్తూ బరువు తక్కువగా ఉండడం, ఎత్తు పెరగపోవటం ఉండే పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రికార్డులన్నీ కూడా పక్కాగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ విధానాన్ని బాగా అమలు చేయాలని వైద్యులను ఆదేశించారు. గ్రామ పరిధిలో ప్రభుత్వ సేవల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితంగా సేవలందించాలన్నారు. ప్రభుత్వ సేవలు సులభతరంగా అందించే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ అనేది చాలా కీలకమన్నారు. సచివాలయ ఉద్యోగులు అంతా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజల అందరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్ ఇంటి పట్టాలు పంపిణీ, మ్యుటేషన్ తదితర అంశాలపై సచివాలయం విఆర్ఒలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాలను వారంలోగా పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీలేరు తహశీల్దార్ జి.రవి, హౌసింగ్ ఇంజనీర్లు, విఆర్ఒలు, ఇతర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- ముందుకు సాగని నిర్మాణాలు
- రూ.కోట్ల నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాలు ఏళ్ల తరబడి నిలచిపోయాయి. గత ప్రభుత్వం నిధులు కేటాయించినా వివిధ కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా రూ. కోట్ల నిధులు నిరుపయోగం అవుతున్నాయి. అంగన్వాడి కేంద్రాలు భవనాలు నిర్మించేందుకు ఐదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ. లక్షల చొప్పున నిధులు కేటాయించింది. బొంగా వాండ్లపల్లి, కావలగడ్డ, సీతంపేట, పొరిమేరపల్లి, వంగిమళ్ళ, గుర్రప్పగారి పల్లి పంచాయతీల్లోని అంగన్వాడీ కేంద్రాలు మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయ పనులు ప్రారంభించారు. అంగన్వాడి కేంద్రాలు స్లాబ్ వరకు వేసి పూర్తయ్యాక వదిలేశారు. తహశీల్దార్ కార్యాలయానికి ప్రజాప్రతినిధులు భూమి పూజ చేసి పిల్లర్లు వేసి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు ముందుకు సాగక చిన్నారులు, నిర్వాహకులు, ప్రజలు, ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులతో కళకళలాడాల్సిన అంగన్వాడీ భవనాలు పశువుల పాకలుగా మారాయి. మరిన్ని భవనాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో దళిత కాలనీల చిన్నారులు పక్క ఊర్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తున్న ప్రభుత్వం చిన్నారులు చదువుకునే అంగన్వాడీ భవనాల గురించి పట్టించుకోకపోవడం దారుణమని పలువురు వాపోయారు. ఇప్పటికే చాలా అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో అసౌకర్యాల నడుమ నడుస్తున్నాయి. అరకొర వసతులు మధ్య



వనంకాడిపల్లెలో మధ్యలోనే ఆగిపోయిన అంగన్వాడీ కేంద్రం పనులు



బొంగావండ్లపల్లిలో ఆగిపోయిన అంగన్వాడీ కేంద్రం పనులు

ఇబ్బందులు పడుతూ అంగన్వాడి టీచర్లు కేంద్రాలను నెట్టుకొస్తున్నారు. అద్దె భవనంలో కాలం వెలదీస్తున్నారు. మరికొన్ని పాత భవనాల్లోనే ఇప్పటికి కొనసాగుతున్నాయి. అవి ఎప్పుడు కూలుతుందోనని భయందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం సర్వ శిక్ష అభియాన్ కింద కొన్ని భవనాలు, పంచాయతీరాజ్ కింద కొన్ని భవనాలు, మండలానికి మంజూరు చేసి పనులు ప్రారంభించి స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయినాయి. గుత్తేదారులకు బిల్లులు రాలేదని అప్పు తెచ్చుకున్న డబ్బులకు వడ్డీలు కట్టలేక పనులు నిలిపివేసినారు. ఇప్పటికీ ఐదేళ్లు కావస్తున్నా ఆ అంగన్వాడీ భవనాలు గురించి ప్రభుత్వం, ప్రజాతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. అంగన్వాడీ భవనాలు ఎప్పుడు పూర్తవుతాయో, సొంత భవనాల్లోకి ఎప్పుడు వెళ్తామోనని అంగన్వాడీ టీచర్లు ఎదురు చూస్తున్నారు. మరో వైపు తహశీల్దార్ కార్యాలయ భవనం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఎప్పుడు పూర్తి చేసి ప్రారంభిస్తారోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తునా్రను. సంబంధిత జిల్లా శాఖ అధికారులు చొరవ చూపి నూతన భవనాల నిర్మాణానికి చొరవ చూపాలని, అర్ధరాంతరంగా ఆగిన భవనాలకు పనులు వేగవంతం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆగిన పనులపై ఆరా తీశాం

అర్ధాంతరంగా ఆగిపోయిన అంగన్వాడీ భవనాల నిర్మాణాల గురించి ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. జడ్‌పి సమావేశంలోనూ ప్రస్తావించాను. అధికారులు త్వరలోనే ఆగిపోయిన భవన నిర్మాణాల పనులు మొదలు పెడతామని తెలియజేశారు. నూతన భవనాల నిర్మాణాల కోసం పంచాయతీ పరంగా తీర్మానాలను మరోసారి ప్రభుత్వానికి పంపుతాం.

-రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిపి, వీరబల్లి.

సమానపనికి సమాన వేతనమివ్వాలని నిరసన

ప్రజాశక్తి-రైల్వేకోడూర్ రూరల్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపిఎండిసి అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్ అన్నారు. బుధవారం భోజన విరామ సమయంలో కార్మికులు ఎంపిఎండిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలను అగ్రిమెంట్ ప్రకారం సక్రమంగా ఫిబ్రవరి 4వ తేదీ నుండి అమలు చేయాలని కోరారు. సమ్మెల ద్వారా సాధించుకున్న సమాన పనికి సమాన వేతనంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గనుల శాఖ మంత్రి చెప్పినా యాజమాన్యం ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. చట్టప్రకారం లేబర్ కమిషనర్‌వద్ద 12(3) అగ్రిమెంట్ ప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాన్ని సైతం అమలు చేయక పోవడం దేనికి సంకేతమో యాజమాన్యం ఆలోచించాలన్నారు. సక్రమంగా సమాన పనికి సమాన వేతనం ఇచ్చేంత వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, జెఎసి పోరాట కమిటీ ట్రెజరీ ఈశ్వరయ్య, నాయకులు చంద్రశేఖర్, దేవకుమార్‌రెడ్డి, మణి, వేణు గోపాల్‌రెడ్డి, దానమయ్య, రమణయ్య, ధనలక్ష్మీ, పెంచలయ్య, ప్రతాప్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎపిఎండిసి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



రికార్డులు పరిశీలిస్తున్న డిడి డాక్టర్ కోటేశ్వరరావు

ఆర్‌బికెల్లో పశుసంవర్ధక శాఖ డిడి తనిఖీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పెద్దమండ్యం, సి.గొల్లపల్లి, కలిచెర్ల, పాపేపల్లి, సిద్ధవరం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మదనపల్లి పశు సంవర్ధ శాఖ డిడి డాక్టర్ కోటేశ్వరరావు బుధవారం తనిఖీ చేచారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌బికెల్లోని పశు సంవర్ధ శాఖకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనతరం ఆయన మాట్లాడుతూ చేయూత ద్వారా లబ్ధి పొందిన వారికి పాడి ఆవులు, గొర్రెలు కావాల్సిన వలచిన వారి జాబితాను సేకరించాలని తెలిపారు. 1962 పశు వైద్య సంచార వాహనం త్వరలో తంబళ్లపల్లికి వస్తుందని చెప్పారు. రైతులకు రాయితీపై ఐదు రకాల విత్తనాలు ఇస్తామన్నారు. ప్రభుత్వం పాడి ఆవులకు రాయితీపై సూది రూ.500కు ఇస్తుందన్నారు. పెయ్యదూడలు పుట్టకపోతే రూ.250 వెనక్కు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది బాబుజన్ నాయిక్, కేశవ, వెంకట రమణరెడ్డి, సచివాలయం సిబ్బంది గుణశేఖర్, రమణ నాయిక్ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో ఐసిడిఎస్ కార్యాలయం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

బి.కొత్తకోటలో కొత్తగా సమగ్ర శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం కానుంది. పాలనాపరమైన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టుల పునర్విభజన ప్రక్రియను ఇటీవల అధికార యంత్రాంగం చేపట్టింది. మదనపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న బి.కొత్తకోటతో పాటు ములకలచెరువు, పిటిఎం మండలాలను కలుపుకుని కొత్త ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లాకు సమాచారం అందింది. ఈ మూడు మండలాల్లో 164 అంగన్‌వాడీ కేంద్రాలు, మరో 57 మినీ కేంద్రాలు ఈ ప్రాజెక్టు పర్యవేక్షణలోకి వస్తాయి. కొత్తగా ప్రాజెక్టు అధికారిణిని నియమిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఇంటి వద్దకే 104 వైద్య సేవలు

వాల్మీకిపురం: ప్రభుత్వం 104తో ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలను అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం వాల్మీకిపురం సచివాలయం-1 పరిధిలోని ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ క్యాంప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా గ్రామానికి వచ్చి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి, మాత్రలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భవతులకు పరీక్షలు నిర్వహించి, వారికి సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం 68 మందిని పరీక్షించి, వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నయీమ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఉషశ్రీ



మొహమ్మద్‌ను సన్మానిస్తున్న ఉర్దూ ఉపాధ్యాయులు

మొహమ్మద్‌కు జీవిత సాఫల్య పురస్కారం

రాయచోటి టౌన్: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న షేక్ మొహమ్మద్ హసీంను బుధవారం అంజుమన్ తరఫి ఉర్దూ జిల్లా శాఖ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ సిబాతుర్ రెహ్మాన్ మాట్లాడుతూ విద్యా రంగంలోనే కాకుండా ఉర్దూ సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈయనకు జీవితకాల సాఫల్య పురస్కారం రావడం జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా ఉర్దూ సాహిత్య రంగంలో సేవలో అందిస్తున్నారని, ఆయన సేవలు మరువలేనివని తెలిపారు. నవంబర్ 30 తేదీన అంజుమన్ తరఫీ ఉర్దూ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉంటుందన్నారు. పయమే సిరతున్ నబీ పుస్తకాన్ని ఆవిష్కరిచారు. కార్యక్రమంలో బజ్మే సాఖియే సుకోన్ వేవస్థాపకుడు డాక్టర్ ఇమామ్ ఖాసిం జలిబ్, అమ్మనత్ సేవ సొసైటీ జనరల్ సెక్రటరీ ఆతాఉల్ల, జరియ ఫౌండేషన్ సభ్యులు, స్టేట్ టీచర్స్ యూనియన్ కన్వీనర్ మునవర్, సూనీర్, అమ్జాద్, ఆరిఫ్, గౌస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

వాల్మీకిపురం: పీలేరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి, సహకరించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం తిరుపతిలోని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహంలో ఏపీ ఎండిసి డైరెక్టర్ హరీష్‌తో కలసి ఆయన కలుసుకొని, నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న వాటికి నిధుల కేటాయించి సహకరించాలని కోరారు. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీలేరు నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని, నిధుల కేటాయింపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆధార్ వివరాలు తెలియని వ్యక్తులకు ఇవ్వరాదని చెప్పారు. యుఐడిఎఐ వెబ్‌సైట్ లేదా ఎం ఆధార్ యాప్ ద్వారా ఆధార్ బయోమెట్రిక్‌లను బ్లాక్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆధార్ కార్డు మోసాలు పెరిగిపోతున్నాయని ఇదే అదునుగా సైబర్ మోసగాళ్లు బ్యాంకు ఖాతాలకు లింక్ చేయబడిన ఆధార్ వివరాలను వేలిముద్రలను రూపొందించి తెలియకుండానే సైబర్ నేరగాళ్లు ఖాతాలలో ఉన్న నగదును కాజేస్తున్నారని అన్నారు. బయోమెట్రిక్ లాక్ చేయడం ద్వారా ఆధార్‌ను సురక్షితం చేసుకోవచ్చని చెప్పారు. ఐరిస్ వేలిముద్రలను ఎవరు ఉపయోగించుకోలేరని అన్నారు. మొబైల్ నెంబర్, ఈమెయిల్ ని ఆధార్ తో లింక్ చేయడం చాలా ముఖ్యమని దీని ద్వారా ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒటిపి అవసరం అవుతుందని తద్వారా మోసాలు అరికట్టవచ్చని అన్నారు. ఎవరికైనా ఆధార్ కార్డు ఇవ్వాల్సిన అవసరం ఉన్నట్లయితే మాస్క్ చేసిన ఆధార్ కాపీనీ ఇవ్వాలని ఇందులో కేవలం నాలుగు అంకెలు మాత్రమే కనబడతాయని పేర్కొన్నారు. మాస్క్ చేసిన ఆధార్ కాపీని http://uidai.gov.in వెబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమానిత వెబ్ సైట్ లలో ఆధార్ కార్డులను ఉంచరాదని కోరారు. ఏదైనా సంస్థలపై అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు.

పిహెచ్‌సిలో కామెర్లకు పరీక్షలు

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కిడ్నీ, కామెర్లకు సంబంధించిన పరీక్షలకు చేస్తారని, అందుకు సంబంధించిన పరికరాలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ విజయకుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలలో కిడ్నీ కామెర్లకు పరీక్ష చేసేందుకు వీలు ఉండేవి కావని చెప్పారు. ప్రస్తుతం పరీక్షలకు సంబంధించిన మిషన్లు వచ్చాయని తెలిపారు. ఎవరైనా పరీక్షలు చేయించుకోవాలి అనుకుంటే స్థానిక ప్రభుత్వా సుపత్రిలో సంప్రదించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో పరిసరాలలో శుభ్రంగా పెట్టుకోవాలని వేడినీటిని తాగాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు నీటిని నిలువ లేకుండా శుభ్రపరచుకోవాలన్నారు, ఇళ్ల ముందు బురద లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వై. రాఘవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టే తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి-రామాపురం

అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ల నియామకంపై బుధవారం కోర్టు స్టే ఎత్తివేయడంపై రాత పరీక్షలో మెరిట్ సాధజంచిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన రాతపరీక్షలలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. తిరిగి రెండు నెలల అనంతరం స్టే తొలగించడంతో మెరిట్ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఐసిడిఎస్ లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలో పదిమంది అభ్యర్థులు మెరిట్ సాధించారు. వారిలో రామాపురం మండలానికి చెందిన వారు ముగ్గురున్నారు. ఇప్పుడైనా నియమకాలు త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు



వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

పేదల ఆరోగ్యమే లక్ష్యం : ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేదల ఆరోగ్యమే తమ లక్ష్యమని, ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసి, మహిళ, బాలింత, పురుష వార్డులను పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని మౌళిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన ఎక్స్‌రే, ఇసిజి, రక్తపరీక్షలు, కాన్పులకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాసుపత్రులను మెరుగుపరస్తూ.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను స్నేహభావంతో పలకరిస్తూ, వారికి అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. అత్యవసరమైతే తప్ప రోగులను రెఫర్ చేయకూడదని, ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని ప్రత్యేక చికిత్సలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ కొరత ఉందని సిబ్బంది ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే డిసిహెచ్ఎస్‌కు ఫోన్ ద్వారా ఫార్మసిస్ట్ పోస్టును భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సనా ఆయేషా, లేఖ్య, హర్షిత, సోని, శ్రీలక్ష్మి, క్రాంతి కుమార్, గురుస్వామి, వైసిపి నాయకులు చింతల ఆనంద రెడ్డి, లక్ష్మన్న, మధనమోహన్ రెడ్డి, సిబ్బంది సుధాకర్, నాగిరెడ్డి, భాస్కర పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా సత్యానందం

రామాపురం: మండల తహశీల్దార్ వై.ఎస్.సత్యానందం డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 190 మంది తహశీల్దార్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో మండల సత్యానందం ఉన్నారు. ఇక్కడికి వచ్చిన అనతి కాలంలోనే ఉద్యోగోన్నతి పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ఆర్థిక లావాదేవీలు

వీరబల్లి: సమాఖ్యల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని ఎపిఎం ఖాదరవల్లి అన్నారు. బుధవారం మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా సంఘాలు చెల్లించే రుణాలు అత్యంత పారదర్శకంగా ఉండాలని సూచించారు. సమావేశంలోని చెల్లింపులకు రసీదులిచ్చి రిజిస్టర్లు నమోదు చేసుకోవాలని కోరారు. లావాదేవీలన్నీ సమాఖ్య లీడర్ల చేత చేయించడం మంచిదన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు వందశాతం ఉండేలా చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు జమీల, సమాఖ్య సిబ్బంది,సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

సైన్స్ ఎగ్జిబిషన్‌తో శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులు పెంచుకోవచ్చని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. బుధవారం స్కూల్‌లో 50 అంశాలపై 51 గ్రూపులు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఐదుగురు విద్యార్థులు మండల స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సైన్స్ పరిజ్ఞానంతో ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతున్నారని విద్యార్థి దశ నుంచి శాస్త్రవేత్తలు ఎదగాలని ఒక దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచి శాస్త్రవేత్త కావాలనా ఆలోచనలో ముందుకు వెళ్లాలన్నారు శాస్త్ర సాంకేతి పరిజ్ఞానం రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు అంతే దశలో ముందుకు వెళ్లాలన్నారు. మంచి ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజకుమార్, విజయ, అధ్యాపకులు జమ్రుద్ బేగం, ఆసిఫా బేగం, శ్రీనివాసులు, శ్రీకల, మురళి, నాయక్, అరుణ కుమారి, భారతి, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

వాల్మీకిపురం : పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం వలన విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 5 అంశాలకు సంబంధించి 73 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించడం జరిగిందని, వాటిని న్యాయనిర్ణేతలు పరిశీలించి ఒక్కో విభాగం నుంచి ఒక్క ప్రాజెక్టును డిసెంబర్ 13న జరిగే మండల స్థాయి పోటీలకు పంపినట్లు తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జ్ హెచ్ఎం అమరనాథ రెడ్డి మాట్లాడుతూ సైన్స్‌పై ఆశక్తి చూపడం వలన విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక, పరిశోధనల పట్ల చిన్ననాటి నుంచే ఆసక్తి పెరుగుతుందని, తద్వారా భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చునన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు బహుమతులను అందజేసి, ప్రోత్సహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్, ఉపాధ్యాయులు శంకర, దుర్వాసులు నాయుడు, భాస్కర్ నాయక్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె : మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులు



ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కొత్త బోయినపల్లె ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల బాలికలు బారులు తీరి ఆసక్తిగా సైన్సు పరికాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ పరికరాలు విజ్ఞాన దాయకంగా ప్రయోగాత్మకంగా ఉన్నాయని ప్రసంశలు పొందారు. ఇందులో ఐదు మందిని మండల స్థాయికి ఎంపిక చేసి బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శేషగిరి, శ్రీలత, లలిత, రమణ నాయుడు షఫీ, ప్రసాద్, చెన్న కేశవులు, రామరాజు, రెడ్డి బాబు, వెంకట సుబ్బయ్య, శారదా, లక్షుమ్మ, గీతావాణి, తులసీ, దార్ల శ్రీనివాసులు ఆచారి, బాలాజీ, సుధామయి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి ఉపాధి పనులపై గ్రామ సభలు


ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలో గుర్తించిన పనులను ఆమోదించటానికి గురువారం నుంచి మండల వ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు మండల ఉపాధి హామీ అధికారి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్‌లో మొదటి విడత గ్రామ సభలను నిర్వహించి మండలంలోని ప్రతి పంచాయతీలోనూ 2023 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసిన వెయ్యి పనులను క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించామని పేర్కొన్నారు. 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అన్ని పంచాయతీలలోనూ గ్రామ సభలను నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బంది ఇదివరకే గుర్తించిన పనులను వివరించి పంచాయతీ ద్వారా ఆమోదించడం జరుగుతుందన్నారు. 24వ తేదీ తవళం, అగ్రహారం కొండ య్యగారిపల్లి, 25న బండ్లపై, నిమ్మనపల్లి, సామకోటవారిపల్లి, 26న రాచవేటివారిపల్లి, రెడ్డి వారిపల్లి, ముష్టూరు, 28న వెంగంవారిపల్లి పంచాయతీలలో వారికి నిర్దేశించిన సమయంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ ద్వారా పనులను ఆమోదింపజేసి ఉపాధి హామీ పథకం జిల్లా అధికారికి నివేదికను పంపుతామన్నారు. ఈ గ్రామ సభలకు ప్రజాప్రతినిధులు, సంబంధించిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి-కురబలకోట

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మిట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. బుధవారం విద్యార్థులకు బోధనకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాల ఆధారిత విద్య అనేది నిర్దిష్ట లక్ష్యాలపై ఆధారపడిన విద్యా సిద్ధాంతమన్నారు. విద్యార్థి-కేంద్రీకృత బోధనా వ్యూహమన్నారు. ఫలితం-ఆధారిత విద్య అనేది విద్యార్థి-కేంద్రీవృత బోధన, అభ్యాస పద్దతితో విద్యాబోధన చేస్తే ఫలితాలను సాధించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

నిరుపేదలకు కోసం పలు రకాల సంక్షేమ పథకాలు అమల పరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదేనని సర్పంచ్ తాళ్ల అరుణ, ఎంపిటిసి కవిత పేర్కొన్నారు. బుధవారం కోటకొండలోని ఉప్పు శారద భర్త శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం, ఆకుతోట జయమ్మకు వైద్య చికిత్సల నిమిత్తం రూ.36 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంజూరు చేయించారు. ఆ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ చైర్మన్ మల్లికార్జున, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు పద్మనాభరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ర్యాలీకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


రెడ్ రైడ్-22 ర్యాలీకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.రాజమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న కె.ప్రసాద్ ఈ ర్యాలీకి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఈ ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ర్యాలీని ప్రారంభించనున్నారన్నారు. ఈ ర్యాలీ విజయవాడలో మొదలై సుక్మాబస్తర్, రాయపూర్, బిలాస్పూర్, జస్పూర్, రాయగడ్, కోర్బా, కాంకర్ దుర్గా, బీజాపూర్ మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో మానవ అక్రమ రవాణా, అనగారిన వర్గాలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారని పేర్కొన్నారు. ర్యాలీకి ఎంపికైన ప్రసాద్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం అభినందనలు తెలిపారు.

2న కృత్రిమ అవయవాల పంపిణీ

పుల్లంపేట: ఒమెగా రెహాబ్ ఫెడరేషన్ వారి సహకారంతో విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన కృత్రిమ అవయవాలకు కొలతలు తీసుకున్న వారికి డిసెంబర్ 2న పంపిణీ చేయనునట్లు సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనర్సారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కొలతలు తీసుకున్న ప్రతి ఒక్కరూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కృత్రిమ అవయవాల పరికరాలను తీసుకెళ్లాలని తెలిపారు.

మద్యం దుకాణం తనిఖీ

తంబళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని బుధవారం ఎక్సైజ్ ఎస్ఐ రామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. స్టాక్ నిలవ, అమ్మకాలు, ఆన్లైన్లో జమ, హద్దులు, నగదు తదితర అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణయాలను కచ్చితంగా పాటించాలని ఫీల్డ్ మోనిటర్ బి.శంకర్ నాయక్, సేల్స్ మెన్ శ్రీనివాసలకు సూచించారు.



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

బురదమయం.. వారపు సంత

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని వారపు సంత బురదమయంగా తయారైంది. చినుకు పడితే చాలు చిత్తడిచిత్తడి గామారుతుంది. దీంతో సంతకొచ్చే ప్రజలతోపాటు వ్యాపారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి బుధవారమూ వారపు సంత నిర్వహిస్తారు. సంతకు మండలానికి చెందిన వారేగాక చుట్టుపక్కల నుంచి వ్యాపారులు, రైతులు తమ కూరగాయలు విక్రయిస్తారు. పక్క మండలాల నుంచి కూడా ప్రజలు సంతకొచ్చి కూరగాయలు కొనుగోలుచేస్తుంటారు. సంతలో పంచాయతీ అధికారులు సరైన వసతి కల్పించలేదు. రూములు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. దీంతో వ్యాపారులు నేలపైనా కూరగాయలు ఉంచుకుని విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి మొత్తం బురదమయంగా మారింది. బుధవారం అందులోనే కూరగాయలు క్రయవిక్రయాలు జరిగాయి. ఫ్లాట్‌ఫామ్ షెడ్డు ఏర్పాటు చేసి ఉంటే తమకు ఇంత అవస్థలు ఉండేవి కావని వ్యాపారులు, రైతులు పేర్కొంటున్నారు. సంతకొచ్చే ప్రజలు సైతం బురదకు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



సంత వద్ద వర్షానికి నిలిచిన నీరు



వర్షానికి కాలువను తలపిస్తున్న బుర్రలవీధి

బుర్రలవీధి జలయమం..

స్థానిక బాలికల ఉన్నత పాఠశాల పక్కన ఉన్న మూడు వీధులలో నుంచి ఒక వీధి ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి జలయమమైంది. మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రధాన మురుగు కాల్వకు ఈ కాల్వను అనుసంధానం చేయకపోవడంతో వీధి మొత్తం మురుగు, వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో వీధిలోని వారు ఆ నీటిలోనే రాకపోకలు సాగించారు. వృద్ధులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. అప్పటికైనా వీధిలో మురుగునీరు సాఫీగా వెళ్లేలా మెయిన్ కాల్వకు అనుసంధానం చేయాలని అధికారులను వీధి వాసులు కోరుతున్నారు.

పశువుల ఆరోగ్యానికి భరోసా 'పశు విజ్ఞాన బడి'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పాల ఉత్పత్తులు పెంపొందించుకుని తద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థిక అభివృద్ధి చెందే దిశగా పాడి రైతులకు అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా పాడిపరిశ్రమాభివృద్ధి, అధిక పాల ఉత్పత్తులు సాధించడంలో మెలకువలు పశు వ్యాధి నివారనోపాయాలు, దూడల, గొర్రెల మేకల పోషణ, పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, గ్రామీణ కోళ్ల పరిశ్రమ వాటి ఆదాయ వ్యయాలు తెలియజేస్తూ ప్రాంతాలవారీగా ఆ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు వాటి నివారనోపా యాలపైన రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తోంది. మరోవైపు పశువిజ్ఞాన బడి ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వారంలో ఒక రోజు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో 15 నుంచి 30 మంది పాడి రైతులు పాల్గొంటారు. ఇక్కడికి వచ్చిన పాడి రైతులకు వారికి అర్థమయ్యే భాషలో పాడి పరిశ్రమ అభివృద్ధిపై పశు వైద్యాధికారులు చక్కగా వివరిస్తారు. పశు విజ్ఞాన బడి ఒక చర్చా వేదికగా రైతులకు ఉపయోగపడుతుంది. పాల దిగుబడిలో మెలకువల గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడుతోంది. కార్యక్రమానికి రైతు సోదరులను సమకూర్చే బాధ్యత రైతు భరోసా కేంద్రంలోని పశువైద్య సహాయకులకు అప్పగించారు. ప్రభుత్వం పాడి పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రులకు రాలేని మారుమూల ప్రాంతాలలో ఉన్న పశువులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలననే ఉద్దేశంతో వైఎస్ఆర్ సంచార పశు వైద్య వాహన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పశు విజ్ఞాన బడుల ద్వారా వేలాదిమంది పాడి రైతులకు పశు వైద్యులు పలు అంశాలపై అవగాహన కల్పించి వారి శ్రేయస్సుకు దోహదపడుతున్నారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశువిజ్ఞానబడులను పశుసంవర్ధక శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 399 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రాంతీయ పశు వైద్యశాలలు 15, పశువైద్యశాలలు70, గ్రామీణ పశువైద్యశాలలు 63 ఉన్నాయి. జిల్లాలో ఆవులు 2 లక్షల 77 వేలు, గేదెలు లక్షా5 వేలు, గొర్రెలు18 లక్షలు, మేకలు 3 లక్షలు, పందులు 2 వేలు, కోళ్లు 31 లక్షలు, ఉన్నాయి. పశు విజ్ఞాన బడి ఈ ఏడాది జూన్ లో ప్రారంభించారు. జూన్ నుంచి నవంబర్ వరకు దాదాపు 715 పశు విజ్ఞాన బడులను నిర్వహించి 18 వేల మంది పైచిలుకు పాడి రైతులకు పాల దిగుబడులలో నూతన ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు.



ఆర్థికాభివృద్ధి సాధించాను..

పశు విజ్ఞాన బడికి హాజరు కావడం ద్వారా పశు పోషణలో పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించుకునే మార్గాలు తెలుసుకొని వాటిని అవలంభించడం ద్వారా అధిక పాల ఉత్పత్తి సాధించి ఆర్థికాభివృద్ధి సాధించగలిగాను. పశు వైద్యాధికారుల నుంచి ఇలాంటి విషయాలు తెలుసుకోవడం ఎంతో లావదాయకంగా ఉంది. కాలానుగుణంగా పశువులకు ఏ కాలంలో ఏ టీకాలు వేయాలి అనే విషయాలపై పశు వైద్యాధికారులు చక్కటి అవగాహన కల్పించారు.

-బాలిశెట్టి ఈశ్వరమ్మ, మహిళా పాడి రైతు, రామాపురం మండలం.

అధిక పాల ఉత్పత్తి

పాడి రైతులు పాల ఉత్పత్తులను సాధించేందుకు దేశీయ పశువుల స్థానంలోనే సంకరజాతి పశువులను పెంచే వైపు మొగ్గు చూపుతున్నారు. వీటి ఆరోగ్య విషయంలోనూ పాల ఉత్పత్తికి తగినట్లు పోషణ పద్ధతులను ఎప్పటికప్పుడూ రైతులు పాటించడం ద్వారా అవి జబ్బు బారిన పడకుండా ఉంటాయి. పాల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో మూడింట ఒక భాగం పశు పోషణకే ఖర్చు పెట్టాలి. అప్పుడే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. ప్రస్తుత వర్షాకాలంలో రైతులు పశుగ్రాసాన్ని పండించి పండిన పశుగ్రాసాన్ని నిల్వ ఉంచుకుంటే వచ్చే వేసవిలో పశుగ్రాస సమస్య అధికమించవచ్చు.

-డాక్టర్ కె. గుణశేఖర్ పిళ్ళై,పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి, రాయచోటి.



భోజనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తహశీల్దార్ నరసింహ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగు దొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనంను తనిఖీ చేశారు. నాడు నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. పాఠశాలలోనే తహశీల్దార్ మధ్యాహ్నం భోజనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం గుడ్లు తదితర వాటి గురించి ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కూళ్లకు విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు చేరవేసి తగిన సహాయ సదుపాయాలు అందిస్తామని తెలపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో సోమ శేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు లేబాక క్రీడాకారులు

ప్రజాశక్తి-నందలూరు

పాఠశాలల క్రీడా సమైక్య ఆధ్వర్యంలో సోమవారం ప్రొద్దుటూరులోని పూజ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఈత, బాస్కెట్ బాల్ పోటీలలో నందలూరు మండల పరిధిలోని లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఈత, బాస్కెట్బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈత అండర్ 17 విభాగంలో కె.నరసింహులు, కె.కూటాలు, ఎన్. రామాంజనేయులు, అండర్-14 విభాగంలో సి. అఖిల్, ఎన్. హరికిషోర్, పి. మహేష్, సత్తా చాటి ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. అదేవిధంగా బాస్కెట్ బాల్ పోటీలలో సిరి వెన్నెల, శివ తరుణ్, హర్షిత, సుదర్శన్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలియజేశారు. వీరిని లేబాక మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపిక అయ్యేందుకు పాఠశాల రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపిక అయ్యేలా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్ ను ఉపాధ్యాయులు, ప్రజలు అభినందనలు తెలియజేశారు.



బాస్కెట్ బాల్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఫుట్‌బాల్ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఎస్.జాస్మిన్ 22వ తేదీన ఎర్రగుంట్లలో జరిగిన పోటీలలో ఎస్‌జిఎఫ్ ఫుట్‌బాల్ అండర్-14 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీహరి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయుడు నీలకంఠరావును అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పాఠశాల విద్యార్థిని అరానించడం చాలా ఆనందంగా ఉందని విద్యా ర్థులను ప్రోత్సహించినప్పుడే వారు మంచి విజయాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు ఆ గ్రామానికి మంచి పేరు తీసుకొస్తారని ఆయన తెలిపారు. సంబంధిత క్రీడల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులకు పాఠశాల యాజమాన్యం తెల్లవార్లూ సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు.

ఘనంగా సత్య సాయిబాబా జయంతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలో భగవాన్ సత్యసాయి 97వ జయంతి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి సమితి కన్వీనర్ శేఖరాచారి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పట్టణంలోని వృద్ధాశ్రమాల్లో అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పట్టణంలో ప్రముఖ వైద్యులు వివిరెడ్డి, షాను, గౌరీ శంకర్ రిటైర్డ్ లెక్చరర్, నవత నారాయణ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి యూత్ కన్వీనర్ వెంకటేష్, సభ్యులు గోపినాథ్, నారాయణాచారి, బాలాజీ, నక్క మహేష్, పవన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మిఠాయిలు ఇస్తున్న నాయకులు



నియామక పత్రం అందుకుంటున్న సయ్యద్ అమీర్

వక్ఫ్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమీర్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని అరవపల్లె గ్రామానికి చెందిన సయ్యద్ అమీర్ అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఎపి స్టేట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రొసీడింగ్స్ ప్రకారం నూతనంగా ఏర్పడిన రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమీర్ ఎంపిక కావడంతో, మండలానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి తనకు ఈ పదవి వచ్చేందుకు ఎంతో సహకరించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో వక్ఫ్ బోర్డ్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనకిచ్చిన పదవికి వన్నె తెచ్చేలా పని చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో కోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి ఉందా?

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడిని విమర్శించే స్థాయి ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి లేదని మదనపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి శ్రీరామినేని జయరామ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నాడని ఆరోపించడం ఆయనకే చెల్లు తుందన్నారు. మూడున్నరేళ్ల వైకాపా ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన నచ్చకనే ప్రజలు తిరగబడుతున్నారన్నారు. జెడ్స్ భద్రత ఉన్న చంద్రబాబుకు ప్రభుత్వమే భద్రత కల్పిస్తుందని ఎంపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లను ఏకవచనంతో పరుష పదజాలంతో మాట్లాడిన ద్వారకనాథ్‌రెడ్డి మాటతీరు మార్చుకోవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మదనపల్లె అభివృ ద్ధికి ఏం చేశారని, ఏ ముఖం పెట్టుకుని మదనపల్లెకు వస్తున్నారని ప్రశ్నించారు. పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీలను విస్మరించిన మాట ప్రజలకు తెలుసునన్నారు. నిబంధనలు విధించి నేతన్న నేస్తంలో కోతలు విధించి కార్మికుల పొట్టకొట్టారని విమర్శించారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమాజంలో ఎంత స్థాయికి ఎదిగినా.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే మనస్సుకు ప్రశాంతత కలుగుతుందని సత్యసాయి సేవా సమితీ కన్వీనర్ రమణమూర్తి అన్నారు. బుధవారం సత్యసాయిబాబా 97వ జయంతిని పురస్కరించుకొని స్థానిక భగవాన్ శ్రీ సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భజనలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీ సత్యసాయి సేవా సమితీ సభ్యులు కలిసికట్టుగా భజనలు చేస్తూ.. ఉదయం 5గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. అలాగే సత్యసాయి సేవా సంస్థల పతాకావిష్కరణ, అభిషేకం, సత్యసాయి వ్రతం, భజన కార్యక్రమాలు నిర్వహించి, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ములకలచేరువు

మండలంలో వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలనాలు చెల్లించాలని ఎఎస్ఐ జిలానిబాషా, హెడ్‌కానిస్టేబుల్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తంబాలపల్లి క్రాస్ రోడ్డులో గతంలో వేసిన ఫైన్ చలనాలను చెల్లించాలని వాహనదారులకు సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా గతంలో వేసిన చలానాలు కట్టకపోతే చర్యలు తప్పవన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వేసుకొని వారు అధికంగా వాహనాలలో ప్యాసింజర్లు రవాణా, ఓవర్ స్పీడ్, మాస్ ధరించని వారు, త్రిబుల్ రైడ్ తదితర చలానాలు చెల్లించని వాహనదారులను గుర్తించి పెండింగ్ చలనలు త్వరితగతిన చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్ పాల్గొన్నారు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

క్రైం కార్నర్



నిందితులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

నాటు సారా స్వాధీనం : ఇద్దరు మహిళలు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

నాటు సారా తీసుకొస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎర్రయ్యగారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన లీలావతి, సోనియాలు కలసి అదే పంచాయతీకి చెందిన నాయనవారిపల్లి నుండి నాటు సారా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో ఇద్దరు మహిళలను అరెస్టు చేసి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ దాడులలో పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, విజయ్ కమల్, ఖలీల్, తేజోవతి, గౌతమి, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని గడి గ్రామానికి చెందిన కెఎస్.గయాజుద్దీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తూర్పుపల్లికి సమీపంలో రోడ్డు పక్కన పొలంలో మోటార్ సైకిల్‌తో పాటు గయాజుద్దీన్ పడి ఉండగా స్థానికులు అతని బంధువులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. బైక్‌ను అదుపు చేయలేక పొలాల్లోకి వెళ్లడంతో గాయాలయ్యాయన్నారు. అతనిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారని చెప్పారు. గయాజుద్దీన్ భార్య షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గయాజుద్దీన్ మృతదేమాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022



వేతనాలు త్వరగా చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు కల్పిస్తూ జీవో నెంబర్ 180 విడుదలైంది, అందుకు అనుగుణంగా వారి జీతభత్యాలు ఆలస్యం కాకుండా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజుకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, నగర కార్యదర్శి కరీముల్లా, సునీల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఎంఇఒలు జీతాలు చేయడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులకు కొత్తగా డిడిఒ అధికారాలు రావడం వల్ల వారికి ఖజానా శాఖలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మున్సిపల్ ఉన్నత పాఠశాలల సిబ్బంది వివరాలను త్వరగా విద్యాశాఖ నుంచి పంపితే డిడిఒ కోడ్ ఇస్తారని పేర్కొన్నారు. అలా డిడిఒ కోడ్ ఇచ్చిన వెంటనే ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జీతాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. స్పందించిన డిఇఒ త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి జీతాలకు ఆలస్యం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మున్సిపల్ హైస్కూల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ మెయిన్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠాలను సులువుగా ఎలా బోధించాలో చూపించారు. విద్యను అభ్యసించేటప్పుడు విద్యార్థులు చదువుతున్న పాఠాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని సులభతరంగా గుర్తుపెట్టుకునే విధంగా ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏ విధంగా బోధిస్తున్నారని అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలించారు. పాఠశాలలో సమస్యలు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రోజూ గైర్హాజరు అయిన పిల్లలతో ఫోన్‌లో మాట్లాడాలని ఆదేశించారు.సబ్జెక్ట్ వారిగా ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారని ఆరా తీశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రోగ్రెస్ పెంచాలి అని సూచించారు. **మారుతి నగర్‌లో పర్యటన** కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ 21వ వార్డు మారుతీ నగర్ ప్రాంతంలో తనిఖీ చేశారు. బుధవారం ఎస్‌విడిసి కళాశాల పక్కన ఉన్న శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెయిన్‌రోడ్డును ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు.



సైన్సు ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వివక్షతను రూపుమాపేందుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఎస్‌సి, ఎస్‌టిలపై వివక్షతను రూపుమాపేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన హాల్‌లో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ్గా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై అత్యా చారాలు జరిగినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అలాంటి కేసులలో బాధితులకు పరిహారం అందించేందుకు సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి సంబంధించిన భూసమస్యలు ఏమైనా ఉంటే ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అత్యా చారాలు నిరోధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డేని నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో పోలీసుల సహకారంతో రోజూ సాయ ంత్రం విద్యార్థుల పై పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోక్సో చట్టం పైన అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర గౌడ్,శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, సోషల్ వెల్ఫేర్ జేడీ జయ ప్రకాష్, ఆర్‌డిఒలు వెంకట రమణ, శ్రీని వాసులు, డిఎస్‌పి శివారెడ్డి, డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి, ఎస్‌పి కార్పొరేషన్ ఇడి వెంకట సుబ్బయ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సమాజిక శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

నేడు 'రారా' శతజయంతి సదస్సు

ప్రజాశక్తి కడప అర్బన్

సాహిత్య అకాడమి, వైవీయూ పరిధిలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి) శతజయంతి సదస్సును గురువారం ఉదయం 10.00 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభ సమావేశంలో ముఖ్యఅతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, గౌరవ అతిథిగా పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పాల్గొంటారని హాజరు కావాలని తెలిపారన్నారు.

అభద్రతా భావంలో చంద్రబాబు

ప్రజాశక్తి - కడప

రోజు రోజుకూ చంద్రబాబు నాయుడు అభద్రతాభావానికి లోనవుతున్నారని చివరి అవకాశమంటూ ప్రజలను అడుక్కోవడం చూస్తుంటే చాలా బాధగా ఉందని ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాష పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర భారత దేశంలో మైనార్టీలను అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళ్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఐదేళ్లల్లో చంద్రబాబు హయాంలో మైనార్టీలకు ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసునన్నారు. మైనార్టీకి చెందిన వ్యక్తికి కనీసం మంత్రి పదవి ఇవ్వలేదన్నారు చంద్రబాబు ముస్లిం మైనారిటీలపై తన సవతి తల్లి ప్రేమ చూపిస్తుంటే నవ్వాలో, ఎడవాలో అర్థం కాలేదు అన్నారు. రంజాన్ తోఫా పేరుతో చంద్రబాబు వారి అనుచరులకే సరుకులు ఇచ్చారని ఆరోపించారు. సామాజిక, ఆర్థిక పరంగా బాగుంటేనే సమాజం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఎల్లో మీడియా వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కథనాలను ప్రచారించాలి హితవు పలికారు. సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి

'గురుకులం' వద్ద మృతదేహంతో బంధువుల ఆందోళన
తల్లిదండ్రులకు న్యాయం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హర్షదీక్షిత్ అనే విద్యార్థి అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురుకులం పాఠశాల వద్ద విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రవి, రాహుల్ నాయకులు మాట్లాడుతూ విద్యార్థి ఆదివారం నుంచి కన్పించకపోతే పాఠశాల అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బ్రహ్మంసాగర్‌లో పడి మృతిచెందారని, అయినప్పటికీ అధికారుల అజాగ్రత్తగా వ్యవహించడం వల్లే ప్రస్తుత హర్ష దీక్షిత్ అనే విద్యార్థి బ్రహ్మంసాగర్‌లో గల్లంతై మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. పాఠశాల అధికారుల పర్యవేక్షణ కొరవవడంతో రోజూ పాఠశాల వేళల్లో విద్యార్థులు బయట తిరుగుతుంటారని వాపోయారు. విద్యార్థులప ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదని పేర్కొన్నారు. విద్యార్థి మృతికి బాధ్యత వహిస్తూ అతని తల్లిదండ్రులకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల సిబ్బంది, అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువలు, ఎస్‌ఎఫ్‌ఐ, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **ప్రిన్సిపల్ భాధ్యత వహించాలి..**



పాఠశాల వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న విద్యార్థి బంధువులు

పోరుమామిళ్ల: విద్యార్థి హర్షదీక్షిత్ మృతికి ప్రిన్సిపల్ బాధ్యత వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, మండల కార్యదర్శి వీరపోగు రవి, ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మం గారిమఠం అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వారు సందర్శించారు. పాఠశాలలో వరుస సంఘటనలు చోటు చేసుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల నియామకం కోసం గతంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని బలిసింగపల్లెకు సంబంధించి బుధవారం వాలంటీర్లకు నియామకపత్రాలను ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, ఎంపిడిఒ రఘురామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం. శకుంతల మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన వాలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లకు చెందిన లబ్ధిదారులకు పథకాలు వర్తింపజేయాలన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా అధికారులకు తెలియజేయాలని సూచించారు. విధుల్ని సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

27న మహాభారత పుస్తకావిష్కరణ సభ

కడప అర్బన్ : పుత్తా పుల్లారెడ్డి రచించిన 'మహాభారత విజ్ఞానసర్వస్వం -(శ్రీవేంకటసుబ్బార్య)' (నాలుగు సంపుటాలు) పుస్తకావిష్కరణ సభ ఈనెల 27 ఉదయం మునిసిపల్ (గ్రౌండ్స్) ప్రాంగణంలోని ఎవిఎం హాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, ఇంజినీర్ పుత్తా వెంకట సుబ్బారెడ్డి (రచయిత కుమారుడు) ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఉపముఖ్య మంత్రి ఎస్.బి.అంజద్ బాష, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య రామకృష్ణారెడ్డిలతో పాటు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథ శర్మ పాల్గొంటారని తెలిపారు.

జగన్ గెలిచాడు ప్రజలు ఓడారు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఒక్క ఛాన్స్ పేరుతో మభ్య పెట్టి జగన్ ఎన్నికల్లో గెలిచాడని, ప్రజలు మాత్రం ఓడిపోయారని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి అన్నారు. బుధవారం రహ మతీయ ఫంక్షన్ హాల్‌లో క్లస్టర్ స్థాయి సమావేశం సందర్భంగా విలేకరుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కర్నూల్‌లో నిర్వహించిన 'ఇదేమి కర్మ' కార్యక్రమం విజయవంతమైందన్నారు. నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో ప్రజలకు, రైతులకు ఒనగురింది ఏమీలేదని విమర్శించారు. ప్రజలకు ఎలాంటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండానే రూ.8. 50 కోట్లు అప్పు చేశారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఉండాలో పోవాలో అనేదానికి చివరి ఎన్నికలని టిడిపి అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. దీన్ని వక్రీకరిస్తూ చంద్రబాబుకు చివరి ఎన్నికలు అనడం సరి కాదని తెలిపారు. ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇవ్వడం వల్ల రాష్ట్రం అధోగతి పాలయిందని చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకుని రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారు. డిప్యూటీ సిఎం రౌడీమూకలతో అరాచకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తామని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమీర్‌బాబు

వృద్ధులను విస్మరిస్తే శిక్షార్హులు : జడ్జి

కడప : వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, వారిని విస్మరించినా శిక్షార్హులు అవుతారని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. బుధవారం జడ్జి నగరంలోని ఆజాద్ నగర్‌లో బృంద వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలియజేశారు. సీనియర్ సిటిజన్స్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 పైన అవగాహన కలిగించారు. నల్సా (లీగల్ సర్వీసెస్ సీనియర్ సిటిజన్) పథకం 2016 గురించి వివరించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ నియమావళిని వివరించారు. సీనియర్ సిటిజన్లు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

జిఎస్‌టి రద్దు చేయాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి- కడప అర్బన్

బిందు సేద్యం డ్రిప్ ఇరిగేషన్‌లో వినియోగించే స్ప్రింకర్లు, పరికరాలపై 12శాతం జిఎస్‌టి విధిస్తూ రైతులపై భారం మోపడం అన్యాయమని, వెంటన రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి అన్నారు. బుధవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని ఆదా చేసే లక్ష్యంతో నీటి కొరత ఉన్న మెట్ట ప్రాంతాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేసుకుంటూ, మరోవైపు స్ప్రింకర్ల పరికరాలపై కేంద్ర ప్రభుత్వం 12 శాతం జిఎస్‌టి భారాన్ని రైతులపై మోపడం దుర్మార్గకరమని పేర్కొన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందని, సాగు పెట్టుబడి కూడా రాలేదని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు, మద్దతు ధర లేదని, రైతులను ఆదుకోవాల్సిన తరుణంలో డ్రిప్, ఇతర పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి విధించడం దారుణమని తెలిపారు. కరువు పీడిత ప్రాంతాలలో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలను కాపాడుకుంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రిప్ సబ్సిడీని మాత్రం సక్రమంగా చెల్లించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి జిఎస్‌టిని రద్దు చేయించాలని, లేదా ఆ భారాన్ని ప్రభుత్వమే భరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. లేనిపక్షంలో రైతాంగాన్ని కలుపుకొని ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న దస్తగిరిరెడ్డి

చీనీ, నిమ్మ రైతులకు శిక్షణ

చెన్నూరు: ఉద్యానశాఖ జోతిరావు ఆధ్వర్యంలో బుధవారం రైతులకు చీనీ, నిమ్మ సాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాగిరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీదేవి, బయనపల్లి సర్పంచ్ చంద్ర పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

భూసమస్యను వెంటనే పరిష్కరించాలి

కాశినాయన : మండల పరిధిలోని అక్కిమ్‌గుండ్ల దళితుల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యులు ఇత్తడి నారాయణ, సిపిఎం మండల కన్వీనర్ పోలయ్య పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పేదలు కొన్నేళ్లు నుంచి భూముల సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి పట్టాలు రద్దు చేసి లబ్ధిదారులకు భూ పట్టాలు ఇవ్వడంలో అధికారులు పూర్తి విఫలమయ్యారని వాపోయారు. ఆరుగురు తహశీల్దార్లు గ్రూపులుగా విడిపోయి విచారణ చేసినా పైస్థాయి పక్కన పెట్టి లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు.

ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలి : సిపిఎం

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక ఎస్‌టి కాలనీలోని సర్వే నంబర్ 1271/5, 1263, 1272లో ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సిపిఎం మండల కార్యదర్శి పోరుమామిళ్ల డిమాండ్ చేశారు. బుధవారం ఆక్రమిత భూమిలో కడుతున్న నిర్మాణాలను ప్రజలతో కలిసి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ విజయకుమారి, విఆర్ఒ రామలక్ష్మమ్మ, సర్వేయర్ జానీ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ 2010లో అప్పటి తహశీల్దార్ అయూబ్‌కాన్ పట్టాలు మంజూరు చేసిందని చెప్పారు. ఈ భూమిని తాము ఆక్రమించినట్లు 2015లో అధికారులు తప్పుడు కేసులు బనాయించారని పేర్కొన్నారు. ఆక్రమణ దారుల దొంగ పట్టాలు సృష్టించి స్థలాన్ని కబ్జా చేశారని పేర్కొన్నారు. వెంటనే ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఈ భూమిలో ఎవరు నిర్మాణాలు చేపట్టరాదని, 144 సెక్షన్ అమలు చేస్తామని, ఇక్కడ నోటీసు బోర్డుని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమస్యను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చు అని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కెవికెలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కెవికె సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ రెండు రోజుల నుంచి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, శిల్పకళ, మురళీకృష్ణ, విజయలక్ష్మి, మహేష్ బాబు, నాగిరెడ్డి, ప్రశాంతి, లావణ్య పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలి

కడప అర్బన్ : నగరంలో రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని మేయర్ సురేష్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి వైజంక్షన్ వరకు, మాసాపేట నుంచి మాచుపల్లి రోడ్డు, గోకుల్ సర్కిల్ నుంచి కృష్ణ సర్కిల్ వరకు రోడ్డు వెడల్పులలో పనులను త్వర తగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్, వైసిపి నాయకులు సూర్యనారాయణ, ఎల్లారెడ్డి, బాలస్వామిరెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ, ఇఇ, డిఇ, డిసిపి కుమార్ పాల్గొన్నారు.

బిజినెస్ స్కూల్‌తో వైవీయూ ఎంఒయు

కడప అర్బన్ : హైదరాబాద్‌లోని ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్‌తో వైవీయూ ఎంఒయు చేసుకొంది. బుధవారం విశ్వవిద్యాలయంలోని విసి మునగల సూర్యకళావతి సమక్షంలో రిజిస్ట్రార్ దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, ప్రిన్సిపల్ కె.కృష్ణా రెడ్డి, హైదరాబాద్‌లోని ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థులకు నైపుణ్యాలతో పాటు ఉద్యోగ అవకాశాలకు సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ఫైనాన్స్ , స్టాక్ మార్కెట్లో కెరీర్ అవకాశాలపై అవగాహన, నైపుణ్యాలను ప్రోది చేసుకుంటే ఫైనాన్స్ స్టాక్ మార్కెట్లలో విస్తృత అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్ డి ఎస్ ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇంటర్వ్యూ నైపుణ్యాలను, స్టాక్ మార్కెట్, ట్రేడింగ్, ట్రేడ్ సెటిల్మెంట్లు, వ్యాపారంలో సాంకేతిక విధానాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజ్‌మెంట్, విద్యార్థి సంక్షేమ శాఖ కోఆర్డినేటర్, డా. సునీత, కోఆర్డినేటర్ డాక్టర్.కె.మృతంజయరావు, విద్యార్థి సంక్షేమ విభాగం, కామర్స్, ఎంబిఎ, ఎకనామిక్స్, పీఎస్ అండ్ పీఏ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పెద్దదర్గాలో నిషాన్

ప్రజాశక్తి- కడప అర్బన్

డిసెంబర్‌లో నిర్వహించబోయే అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలలో భాగంగా నిషాన్ కార్యక్రమం నిర్వహించనున్నారని దర్గా కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అమీన్‌పీర్ దర్గాలో వారు మాట్లాడుతూ ఈ నెల 24న రాత్రి పది గంటలకు మక్దూమ్ రేఖా (నిషాన్) మెరవణి, మంగళ వాయిద్యాలు, ఖవ్వాలి భాగీలతో పీర్ దర్గా నుండి ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. అమీన్ పీర్ దర్గా అధి గురువు హజరత్ ఖ్వాజా సయ్యద్ షా పీరుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్టియల్ ఖాదరి దర్గా గుమ్మం పైన మక్దూమ్ రేఖాను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. అనంతరం హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్టియల్ ఖాదరి చదివింపులు సమర్పిస్తారని తెలిపారు.

అమూల్ పాలకు గిట్టుబాటు ధర

ప్రజాశక్తి- కడప

పాడి రైతుల ఆర్థిక అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కైరా యూనియన్ ఎపి – అమూల్ డైరీ వారు ఈ నెల 24 నుంచి పాల గిట్టుబాటు ధర పెంచారని ఈ విషయాన్ని పాడి రైతులు, పాల ఉత్పత్తిదారులు గమనించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.30.50 ధర ఉన్న ఆవుపాలు, రూ.32.13లకు పెంచారని, రూ.42.50 ధర ఉన్న గేదెపాలు రూ.44.97 లకు పెంచారని తెలిపారు. పాల ఉత్పత్తి ఖర్చు పెరగడం, నిర్వహణ భారం కావడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. నాణ్యమైన పాల సేకరణను ప్రోత్సహిస్తూ కార్యకర్తలకు ఇచ్చే నిర్వహణ ఛార్జీలను కూడా ఒక కేజీ ఘన పదార్థాలకు గాను 20 శాతం పెంచిందన్నారు. ఆ ప్రకారం ప్రస్తుతం రూ.7.9 లుగా ఉన్న నిర్వహణ చార్జీ మొత్తాన్ని రూ.9.5 లకు పెంచారని తెలిపారు. పశువులు ఆరోగ్యకరంగా ఉండేందుకు, పాల ఉత్పత్తిని పెంపొందించేందుకు అవసరమైన పోషక విలువలున్న పశుదాణాను పాడి రైతులకు సరఫరా చేస్తున్న కార్యకర్తలకు 50 కేజీల బస్తాకు గాను రూ.10 ల చొప్పున ప్రోత్సాహకాన్ని ఇస్తారని తెలిఆపరు. కావున జిల్లాలోని పాడి రైతులు, పాల ఉత్పత్తి దారులు, రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సంఘంసభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కడప

పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రకాష్ నగర్‌లోని బాలుర అర్బన్ హాస్టల్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరమూ ఎన్నో సేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అనాథలకు, వృద్ధులకు దుప్పట్లు, అన్నదాన కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా సామాజిక కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లయన్ మానస చిన్నపరెడ్డి, రాయలసీమ టూరిజం రాజు, ప్రవీణ్, సతీష్, కోటేశ్వరరావు, డేవిడ్, బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న పోతుల వెంట్రామిరెడ్డి

క్రీడా పాఠశాల పరిశీలన

కడప : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. బుధవారం సాయంత్రం క్రీడాపాఠశాలలో శిక్షణ తీసుకున్న క్రీడాకారుల వద్దకు వెళ్లి ఆయన ప్రత్య క్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా క్రీడాంశాలకు సంబంధించిన క్రీడాకారుల ప్రగతి, శిక్షణ విధానాలను అడిగి తెలుసుకున్నారు. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారుల సాధనను పరిశీలించారు. శిక్షకులకు ఆయన పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధాఇంచేలా శిక్షణ అంధించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషా మొహిద్దీన్, కోచ్‌లు, సిబ్బంది ఉన్నారు.



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న శాప్ ఎమ్‌డి

దరఖాస్తులు ఆహ్వానం

కడప: ఉమ్మడి జిల్లాలోని కోర్టుల పరిధిలో పలు రకాలైన పర్మినెంట్ సర్వేయర్ ఉద్యోగాలతో పాటు ఇన్ స్టోర్షన్ చేయడానికి ఆసక్తి గల సర్వేయర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాల్మన్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కోర్టులో పాటు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో 35 రకాలైన పర్మినెంట్ సర్వేయర్, ఇన్‌స్టోర్షన్ చేయుట్లు ఉంటుందని తెలిపారు. అర్హులైన అనుభవం కలిగిన వారు ఈనెల 26న సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్టే తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి-రామాపురం

అంగన్వాడీ గ్రేడ్–2 సూపర్‌వైజర్ల నియామకంపై బుధవారం కోర్టు స్టే ఎత్తివేయడంపై రాత పరీక్షలో మెరిట్ సాధజంచిన అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన రాతపరీక్షలలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. తిరిగి రెండు నెలల అనంతరం స్టే తొలగించడంతో మెరిట్ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఐసిడిఎస్ లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలో పదిమంది అభ్యర్థులు మెరిట్ సాధించారు. వారిలో రామాపురం మండలానికి చెందిన వారు ముగ్గురున్నారు. ఇప్పుడైనా నియమకాలు త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు

సమానపనికి సమాన వేతనమివ్వాలని నిరసన

రైల్వేకోడూరు రూరల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపిఎండిసి అవుట్ సోర్సింగ్, ట్రెనీ కార్మిక పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్ అన్నారు. బుధవారం భోజన విరామ సమయంలో కార్మికులు ఎపిఎండిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలను అగ్రిమెంట్ ప్రకారం సక్రమంగా ఇవ్వాలని ప్రివిఐ 4వ తేదీ నుండి అమలు చేయాలని కోరారు. సమ్మెల ద్వారా సాధించుకున్న సమాన పనికి సమాన వేతనంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గనుల శాఖ మంత్రి చెప్పినా యాజమాన్యం ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. చట్టప్రకారం లేబర్ కమిషనర్ వద్ద 12(3) అగ్రిమెంట్ ప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాన్ని సైతం అమలు చేయక పోవడం దేనికి సంకేతమో యాజమాన్యం ఆలోచించాలన్నారు. సక్రమంగా సమాన పనికి సమాన వేతనం ఇచ్చేంత వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, జెఎసి పోరాట కమిటీ ట్రెజరర్ ఈశ్వరయ్య, నాయకులు చంద్రశేఖర్, దేవకుమార్‌రెడ్డి, మణి, వేణు గోపాల్‌రెడ్డి, దానమయ్య, రమణయ్య, ధనలక్ష్మి, పెంచలయ్య, ప్రతాప్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యత : ఎంపీ

ప్రజాశక్తి - చక్రాయపేట

వైసిపి ప్రభుత్వం యువతకు ప్రాధాన్యత నిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సురభి గ్రామ పంచాయతీ నాగల గుట్ట పల్లెలో బుధవారం ఆయన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. కార్యక్రమానికి అధికారులు, జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి, ఎంపిపి మాధవి బాలకృష్ణ, సర్పంచు శ్రీనివాసులు, వైసిపి నాయకులు హాజరయ్యారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పంట నమోదు పత్రాలు రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట నమోదు పత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం సర్పంచు అరుణమ్మ ఆధ్వర్యంలో ఆయన రైతులకు పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచు అరుణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రధాన్యతనిచ్చి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎఒ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పంట నష్ట పరిహారం, బీమా పొందేందుకు పత్రాలు ఉపయోగపడుతాయని వివరించారు. మద్దతు ధర తక్కువగా ఉన్నప్పుడు నేరుగా ప్రభుత్వానికి మార్కెట్ యార్డులో అమ్ముకునేందుకు ఈ పత్రాలను వినియోగించు కోవచ్చన్నారు. సున్నా వడ్డీ పంట రుణాల జాబితాను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. లక్ష రుణం తీసుకున్న రైతుల పేర్లు సున్నా వడ్డీ అర్హుల జాబితాలో లేకపోతే బ్యాంకులో ధ్రువీకరణ పత్రం అందిస్తే సున్నా వడ్డీ పంట రుణం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సర్పంచ్, ఎఒ

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని కేశలింగాయపల్లి గ్రామానికి చెందిన కేశా సాంబశివ అను వ్యక్తి పోగొట్టుకున్న ల్యాప్ టాప్‌ను బుధవారం స్థానిక ఆర్‌టిసి అధికారులు అతనికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం ప్రొద్దుటూరు నుండి కడపకు వెళుతున్న బస్సు లో సాంబశివ మైదుకూరు వరకు ప్రయాణించాడు. బస్టాండ్ రాగానే అతని దగ్గర ఉన్న ల్యాప్‌ట్యాప్‌ను బస్సులోనే మరిచి పోయిదిగి, కొద్ది దూరం వెళ్లగానే గుర్తుకు రావడంతో బస్టాండ్ విచారణ కేంద్రాన్ని సంప్రదించాడు. బస్సు టికెట్ ఆధారంగా ఆ బస్సును గుర్తించిన జనరల్ ఎడిసి లక్షుమయ్య డ్రైవర్‌తో మాట్లాడారు. ఆ డ్రైవర్ బ్యాగ్‌తోపాటు ల్యాప్‌టాప్‌ను మైదుకూరు బస్టాండ్‌లో అందజేశారు. దీన్ని లక్షుమయ్య సాంబశివకు అందజేశారు. తన ల్యాప్‌టాప్‌ను తెప్పించి ఎడిసి లక్షమయ్యకు సహకరించిన వేంకటేశ్వర్లుకు, సెక్యూరిటీ విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ విజయకు కృతజ్ఞతలు తెలిపాడు.



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఆర్‌టిసి సిబ్బంది

'అన్నదానం'లో భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక కడప రోడ్డులో వెలిసిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. చిర్రాజుపల్లెకు చెందిన గంగిరెడ్డి మహేష్‌రెడ్డి అన్నదాన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యువతకు జీవనోపాధి

ప్రజాశక్తి - మైలవరం

దీక్ష కేంద్రం కోసం దాల్మియా భారత్ ఫౌండేషన్ ఏపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఎంఒయు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రతి ఏడాది 360 మంది యువతకు జీవనోపాధి కల్పించనున్నారు. ఆ మేరకు ఏపి ఎస్ఎస్‌డిసి మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, దాల్మియా భారత్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవింద్ బోధనకర్ బుధవారం ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప దీక్షా కేంద్రం 360 మంది ట్రైనీ ప్రారంభ వార్షిక శిక్షణ సామర్థ్యంతో నిర్మాణ సంబంధిత నైపుణ్యాలు ఐటిఐఎస్, హెల్త్ కేర్ సెక్టార్ కడప జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడానికి ఈ సెంటర్‌లో ముందస్తు అర్హత, వృత్తిపరమైన శిక్షకులు ఉంటారని తెలిపారు. నిర్మాణరంగం హెల్త్ సెక్టార్ మొదటి పక్షంలో నమోదు చేసుకున్న నిరుద్యోగ యువతకు నైపుణ్య అంతరాన్ని పూరిస్తుందన్నారు. వారిని పరిశ్రమకు సిద్ధం చేసేందుకు ప్రత్యేకమైన పరిశ్రమ సంబంధిత కోసం విషయ నిపుణులు పారిశ్రామిక నిపుణులతో పరస్పర చర్యలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారికి అసెస్మెంట్, సర్టిఫికెట్ల ప్రక్రియను సులభతరం చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్లేస్మెంట్ కోసం సహాయం అందించడంతోపాటు జాయింట్ సర్టిఫికేషన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపిఎస్ఎస్‌డిసి ఎండి కలెక్టర్ సత్యనారాయణ, దాల్మియా యూనిట్ హెడ్ ముఖేష్ సింహ, అశ్విన్‌కుమార్, సంజయ్‌కుమార్, రామరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.


సంతకాలు చేసిన ఫైలును చూపిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన వైసిపి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తాను 30ఏళ్లుగా ప్రయివేట్ విద్యాసంస్థను నిర్వహిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు తెలుసునని పేర్కొన్నారు. టిఎ, డిఎ, పిఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ వెంకటాద్రిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, నాయకులు, కౌన్సిలర్ కిషోర్, నారాయణసాగర్ సంఘ నాయకులు రసూల్, వివిధ ప్రభుత్వ ప్రయివేట్ ఉపాధ్యాయ సంఘ నాయకులు, విద్యా సంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

మురుగు సమస్య తీరేదెన్నడో..!

- రోడ్లపై పారుతున్న మురుగునీరు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డు కటిక బజార్‌లో మురుగునీటి సమస్య స్థానికులను వేధిస్తోంది. రోడ్లపై మురుగు నిల్వ ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య నుంచి తమను విముక్తులను చేయాలని పలుదపాలుగా మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. విద్యార్థులు, మహిళలు ఈ మురుగు నీటి గుండా వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇలా మురుగునీటితో చర్మసంబంధ వ్యాధులు కూడా వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఖాళీ స్థలంలో చెత్తకుండీని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల వారు చెత్త వేస్తున్నారు. వేసిన చెత్తను రోజూ మునిసిపాలిటీ వారు తీసేయకపోవడంతో ఆ ప్రాంతం కుళ్లి దుర్వాసనను వెదజల్లుతోందని వాపోతున్నారు. ఆ ప్రాంతం దాటేవరకు ముక్కు మూసుకుని వెళ్లాల్సిందేనని పేర్కొంటున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చినప్పుడు సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే రోడ్లు, కాలువలు వేసే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారని అంటున్నారు. కానీ గత వారంలో మళ్లీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారని, ఎమ్మెల్యే సైతం ముక్కు మూసుకొని గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చారని ప్రజలు పేర్కొన్నారు. మురుగు నీరు, దుర్వాసన సమస్యలతో పాటు పందుల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడేలేరని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్లపైనే ఉన్న మురుగునీరు


పందులతో అపరిశుభ్రంగా ఉన్న చెత్త కుండీ ప్రాంతం

వైసిపి ప్రభుత్వం రైతు వ్యతిరేకి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం రైతు వ్యతిరేకమని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ రుణాలు, సున్న వడ్డీ పథకానికి నామాలు పెట్టిందని విమర్శించారు. పావలా వడ్డీకి పాడె కట్టిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2011లో సున్నావడ్డీ, పావలా వడ్డీ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకొని ఏడాది లోపు చెల్లించిన రైతులకు లక్ష రూపాయలు వరకు సున్నావడ్డీ పథకం, లక్ష నుండి మూడు లక్షల వరకు రుణాలు తీసుకొన్న రైతులకు పావలా వడ్డీ పథకం అమలయ్యేదని తెలిపారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేదన్నారు. జగన్ ప్రభుత్వం పావలా వడ్డీ పథకాన్ని పూర్తిగా ఎత్తేసిందని తెలిపారు. సున్నా వడ్డీ పథకాన్ని లక్ష రూపాయలు లోపు రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. లక్షకు పైగా వెయ్యి రూపాయలు ఎక్కువ రుణం తీసుకొన్న మొత్తం రుణానికి సున్నా వడ్డీ వర్తించదన్నారు. లక్ష లోపు రుణాలు తీసుకొన్న రైతులు కొంతమంది మాత్రమే ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రుణాలకు రెండు లక్షల వరకు సున్నావడ్డీ పథకాన్ని అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రెండు లక్షల నుండి రూ.5లక్షల వరకు పావలా వడ్డీ పథకాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రితో జరిగే సమావేశంలో రాష్ట్ర సమస్యలపై చర్చించాలని ఆయన సూచించారు. ప్రత్యేకహోదా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఎపికి కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సింది కొండంత అయితే.. గోరంత ఇచ్చిందని చెప్పారు. 9,10 షెడ్యూల్‌లోని సంస్థల విభజన ఇప్పటికీ పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు.

సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి


వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి సైన్సు పట్ల మక్కువ పెంచుకోవాలని బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి వైజ్ఞానిక సైన్సు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల మేధాశక్తితో రూపొందించిన సైన్సు ప్రాజెక్టులను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. వైజ్ఞానిక ప్రదర్శించిన ప్రాజెక్టులకు సంబంధించి వాటి ఉపయోగాలను తోటి విద్యార్థులకు తెలిపారు. న్యాయ నిర్ణేతగా విశ్రాంతి ఉపాధ్యాయుడు కవి ప్రసాద్ ఆధ్వర్యంలో గణిత, సైన్సు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పర్యవేక్షణలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి వైజ్ఞానిక సైన్సు ప్రదర్శనశాలు చాలా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందించేందుకు కూడా దోహదపడుతాయని ఆమె వివరించారు. సైన్స్ అనేది దేశానికి ఆయువు పట్టు అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సైన్సు పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులను మండలస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక జిఓతో క్రమబద్ధీకరించాలి : కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రత్యేక జిఒ తెచ్చి మమ్మలను క్రమబద్ధీకరించాలని ఆర్‌టిపిపి కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వద్ద రెండు రోజులుగా కాంట్రాక్ట్ కార్మికులు, భూ నిర్వాసితులు ఆందోళన చేస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఆర్‌టిపిపిని నమ్ముకుని ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామన్నారు. ఎప్పటికైనా ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోతాయా అనే ఆశతో ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం జిఒ 163 తెచ్చి వారికి అనుకూలమైన పులివెందుల నియోజకవర్గానికి చెందిన 37 మందిని డైరెక్ట్‌గా రెగ్యులర్ ఆర్డర్‌తో ఉద్యోగాలిచ్చారని తెలిపారు. తమకు కూడా ప్రత్యేక జిఒ తెచ్చి 1600 పైచిలుకు కార్మికులందరిని భేషరతుగా రెగ్యులర్ చేయాలని ఆర్‌టిపిపి జెఎసి నాయకులు కోరారు. ఈ పోరాటంలో ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు, ఉద్యోగ సంఘాలు తమ పూర్తి మద్దతును ప్రకటించాయి. భవిష్యత్తులో కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు చేసే ప్రతి పోరాటంలోనూ తమ సహాయ సహకారాలు ఉంటాయని ఆ నాయకులు పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న జగన్ మాట ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక దానిపై ఆయన స్పందించలేదన్నారు. సిఎం సొంత జిల్లా హామీ ఇచ్చి మరిచిపోయినందున, ఇక్కడ నుంచే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జెఎసి నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు, టిడిపి నేతలు, సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


గేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న భూ నిర్వాసితులు

పిహెచ్‌సిలో కామెర్లకు పరీక్షలు

- డాక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కిడ్నీ కామెర్లకు సంబంధించిన పరీక్షలకు చేస్తారని, అందుకు సంబంధించిన పరికరాలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ విజయకుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలలో కిడ్నీ కామెర్లకు పరీక్ష చేసేందుకు వీలు ఉండేవి కావని చెప్పారు. ప్రస్తుతం పరీక్షలకు సంబంధించిన మిషన్లు వచ్చాయని తెలిపారు. ఎవరైనా పరీక్షలు చేయించుకోవాలి అనుకుంటే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలన్నారు.

ప్రస్తుత సీజన్‌లో పరిసరాలలో శుభ్రంగా పెట్టుకోవాలని వేడినీటిని తాగాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు నీటిని నిలువ లేకుండా శుభ్రపరచుకోవాలన్నారు, ఇళ్ల ముందు బురద లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వై. రాఘవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో రబీలో సాగు చేసిన జొన్న, మినుము, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి నవంబర్ రెండవ వారం వరకు రైతులు పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పంటలు వివిధ దశలలో ఉన్నవి. మండల పరిధి లోని వెదురూరు, రాజు పాలెం, తిప్పిరెడ్డిపల్లె, సిద్ధారెడ్డిపల్లి, మడూరు, చియ్యపాడు, వెంగన్న గారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 5వేల ఎకరాలలో ఆరుతడి పంటలను సాగు చేశారు. జనవరి చివరికి ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కుందూ, పెన్నా తీర గ్రామాల పరిధిలో మాత్రం వరి పంట నూర్పిడి పనులు చేపడుతున్నారు. అనంతరం మళ్లీ వరి సాగు చేపడుతున్నారు. కొంత మంది రైతులు నూగు, దోస పంట సాగు చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు. గత వారంలో పడిన వర్షానికి ఆరుతడి పంటలకు ఇబ్బంది లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికంగా వర్షం, గాలులు వీస్తే పూత దశలో ఉన్న పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు.


జడ్జిగారి కొట్టాల వద్ద సాగులో ఉన్న మినుము పంట

కలుషిత నీటితో పశువులకు సమస్యలు


ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న కలుషిత నీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మడూరు గ్రామ పంచాయతీ పరిధిలో పశువులు కలుషిత నీరు తాగడం, మునగడం వలన సమస్యలు వస్తున్నాయి. ప్రొద్దుటూరు నుంచి మండల పరిధిలోని చిన్న వరదాయ పల్లి గ్రామం వద్దకు మురుగునీరు వచ్చి చేరుతోంది. మేతకు వెళ్లే పశువులు ఈ నీటిలో కలియ తిరుగుతూ అనారోగ్యబారిన పడుతున్నాయి. పశువులు ఈ నీటిని తాగడం వలన అస్వస్థతకు గురవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నీటి ఆధారంగా మెలకెత్తిన గడ్డి తినడం వలన కూడా పశువులు అనారోగ్య బారిన పడతాయని, పశువులు కాలువ నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాడి రైతులకు సూచిస్తున్నారు. గత ఏడాది ఈ నీటిని తాగడం వలన 15 పశువులు అస్వస్థతకు గురైనట్లు మండల పశువైద్యాధికారి మొహమ్మద్ గౌస్ తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. మురుగునీరు ప్రవహిస్తున్న కాలువలోకి పశువులు దిగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తే మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఆ మేరకు రైతులు కూడా ఆ కాలువ వైపు పశువులను వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యల్లటూరు చంద్రశేఖర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక బిసి కాలనీకి చెందిన యల్లటూరు చంద్రశేఖర్‌కు కడప యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రీసెర్చ్ ఫెలోగా చంద్రశేఖర్ ఎంపికై, యోగి వేమన విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా చేరారు. రసాయనక శాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్ ఎల్.సుబ్రమణ్య శర్మ పర్యవేక్షణలో 'ఎలక్ట్రో ఆక్సిడేషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఆర్గానిక్ మాలిక్యుల్స్ ఆన్ గ్రాఫెన్ బేస్డ్ నానో కాంపొజిటిస్ ఫర్ ఫ్యూయల్ సెల్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు. వైవియు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేయడం పట్ల స్థానికులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు హర్షం చేస్తూ చంద్రశేఖర్‌ను అభినందించారు.



దాడి హేయం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ, మహిళా మాదిగలపై గుంటూరు జిల్లా నగరపాలెం సిఐ హేమంత్‌బాబు దురుసుగా ప్రవర్తించి, వారి మీద చేయి చేసుకోవడం హేయమైన చర్య అని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల మునుస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యలయంలో ఎఒ ఇక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితుల నాయకులకు ఏమాత్రం విలువల్లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లాలో ఒక కేసు విషయం మీద కలెక్టర్‌కు రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ అర్జీ ఇవ్వడానికి వెళితే అక్కడ ఉన్న సిఐ అమానుషంగా ప్రవర్తించి, మహిళా నాయకులని కూడా చూడకుండా వారిని తోసేశారన్నారు. కార్యకర్తలపై కూడా దాడి చేశారన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు హరికృష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. సంఘటనపై వెంటనే డిజిపి స్పందించి సదరు సిఐపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు వెంకటసుబ్బయ్య, పాపోడు, కోట సుబ్బయ్య రాజశేఖర్, చింతాకు రాముడు, ఊసేన్ పాల్గొన్నారు.


ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హెచ్‌ఐవి పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

హెచ్‌ఐవి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎహెచ్‌ఒ జగదీష్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవి /ఎయిడ్స్, రక్తదానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్ అనే భయంకరమైన వ్యాధి గురించి తెలుసుకోవాలని కోరారు. 16 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు చాలా ప్రాముఖ్యమైనదని, విలువైనదని తెలిపారు. ఈ దశను కాపాడుకోవడంలో విద్యార్థుల్లో ఉన్న వారి వైఖరి, అలవాట్లు ప్రభావాన్ని చూపిస్తాయని వివరించారు. విభిన్న కేస్ స్టడీస్‌లను ఉదాహరణల ద్వారా వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడినవారవుతారని అన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ, హెచ్‌హెచ్‌ఒ ప్రోగ్రాం ఆఫీసర్ శైలజ, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫర్వీన్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారదర్శకంగా పాల సేకరణ

ప్రజాశక్తి - వేముల

పారదర్శకంగా పాల సేకరణ చేపట్టాలని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ డిఆర్‌డిఎ మెంటార్ ఆంజనేయులు సూచించారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాల సేకరణ జరుగుతున్న కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రూట్ సెవెన్ పరిధిలో అలవల పాడు, రామిరెడ్డి పల్లి, సిద్ధంరెడ్డి పల్లి పాలసేకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల స్వచ్ఛతను, శాంపుల్ పాల సేకరణ, బిల్లుల చెల్లింపులు, ఎస్ఎంఎస్ అలర్ట్ ద్వారా సమాచారం చేరవేయడం, పాల కేంద్రం పరిశుభ్రత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లో కార్యక్రమంలో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ ద్వారా పాల సేకరణ పారదర్శకంగా జరగాలని సూచించారు. మహిళ పాడి రైతులు స్వచ్ఛమైన, నాణ్యమైన పాలకు సహకరించాలని కోరారు. అమూల్ ప్రాజెక్ట్ ఈనెల 24వ నుండి పెరిగిన కొత్త పాల ధరలు అమలులోకి వస్తుందని తెలిపారు. ఆ మేరకు పాలు పోసిన వారు కొత్త రేట్‌చార్ట్ ప్రకారం ధరలను సరిచూసుకోవాలని సూచించారు. ఎఎంసియు సెక్రటరీలు, మహిళా డెయిరీ సాకార సంఘాల ప్రమోటర్లు పాడి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విఒఎలు, ఎఎంసియు సెక్రటరీలు, మహిళలు పాల్గొన్నారు.


పాలసేకరణను పరిశీలిస్తున్న ఆంజనేయులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల బ్రిడ్జి వద్ద బుధవారం ఆటో అదుపు డివైడర్‌ను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కడప నుంచి కమలాపురం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే 108ను సంప్రదించి గాయపడినవారిని కడప రిమ్స్‌కు తరలించారు.


ప్రమాదంలో గాయపడిన మహిళ

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

పుల్లంపేట: మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తహశీల్దార్ నరసింహ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగు దొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. నాడు నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. పాఠశాలలోనే తహశీల్దార్ మధ్యాహ్నం భోజనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం గుడ్లు తదితర వాటి గురించి ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అంది స్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండిన ట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో సోమ శేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.